# ఏలియా

బి.పి. కరుణాకర్


కథ

మధ్యాహ్నం భోజనాలయ్యాక లెక్కలక్లాసు మొదలు కావలసి ఉంది. మాస్టారింకా రాలేదు.

మా స్కూలు ఫయినలు 'ఎ' సెక్షను హెడ్మాస్టరుగారి గది పక్కనే ఉండటాన క్లాసులో మాస్టార్లు లేకపోయినా క్లాసు నిశ్శబ్దంగానే ఉంటుంది. కింది క్లాసులంత గొడవగా ఉండదు.

బెంచిలో నా పక్కనే కూర్చునే ఏలియా టిఫిను బాక్సు కడుక్కున్న తర్వాత నా కూడా రాలేదు. ఏ మాస్టరయినా ఏ పనయినా చెప్పారేమో?

ఏలియా, నేను ఒక వయసువాళ్లం. గత నాలుగు సంవత్సరాల నుండి స్నేహితులం. ఒకే పేటలో ఉంటుంటాం. మేము ఉండే వీధికి రెండు వీధుల అవతల ఏలియావాళ్లు ఉంటున్నారు. స్కూలుకు ఇద్దరం కలిసే వస్తాం. తిరిగి కలిసే వెళ్తాం. స్కూల్లో కూడా కలిసే ఉంటాం. నేను నల్లగా ఉంటాను. ఏలియా ఎర్రగా నా కన్నా పొడుగ్గా లావుగా ఉంటాడు. నేను సన్నగా ఉంటానని ఏ ఆటలో తీసుకునేవారు కాదు. అరవడానికి, చప్పట్లు కొట్టడానికి, ఈలలు వేయడానికి మటుకు ఉపయోగించుకునేవాళ్లు. ఏలియాకు ఆటలు వచ్చు కాని ఆటల మీద ఎటువంటి శ్రద్ధ చూపించేవాడు కాదు- డ్రిల్లు మాస్టారు పట్టుబడి ఆడిస్తే తప్ప! చివరి గంట కొట్టగానే, పుస్తకాలు సంచిలో సర్దుకుంటూ, "పద, వెళ్లిపోదాం" అని తొందర పెడుతుంటే నేను తప్పించుకోలేకపోయేవాడిని. వాడికి ఇంటికి ఎప్పుడెప్పుడు తిరిగివెళ్లిపోదామా అనుకోడానికి కారణం ఉంది. వాడి తల్లి చనిపోయి మూడు సంవత్సరాలు పయిగా అయింది. వాళ్ల నాన్న మళ్లీ పెళ్లి చేసుకోలేదు. వాడికో తమ్ముడు, చెల్లెలు ఉన్నారు. వాళ్లను చూడడం, స్కూలు నుండి రాగానే వాళ్లచేత హోంవర్కు చేయించడం, వంటా, వార్పు చేయడం దాదాపు అన్ని బాధ్యతలు వాడివి. ఓపికగా చేసేవాడు. వాళ్ల నాన్న పేరున్న పుగాకు కంపెనీలోని ఆఫీసరు కారుకు డ్రయివరు. చాలా కోపిష్టి. ఆయన ఉండగా వాళ్లింటికి వెళ్లడం నాకు భయం. ఆయన పిల్లలు ఏ చిన్న తప్పు చేసినా బెల్టుతో కొడ్తాడు. తమ్ముడినీ, చెల్లెల్ని కొడుతుంటే ఏలియా అడ్డం వెళ్లి ఆ దెబ్బలు వాళ్లకు తగలనీయకుండా తను తినేవాడు. "నాన్నా, వాళ్లను కొట్టకు. నన్ను కొట్టు. తప్పంతా నాది" వాళ్ల తప్పులు తన మీద వేసుకునేవాడు.



మొదట్లో చుట్టుపక్క ఇళ్లవాళ్లు ఆయన ఏలియాను కొడుతుంటే అడ్డం వెళ్లి ఆపబోతే, "ఇది మీ ఇంటి విషయం కాదు. మీ ఇంట్లో ఏమన్నా జరుగుతుంటే నేను ఎప్పుడయినా జోక్యం చేసుకున్నానా?" అంటుండేసరికి ఆ కుటుంబం గురించి పట్టించుకోవడం మానేశారు. ఏలియా రెండు మూడు రోజులకొకసారయినా దెబ్బలు తింటున్నా మాటవరసకయినా నాతో ఎప్పుడూ అనలేదు. వాడి ఆత్మనూన్యతాభావం ముట్టుకోవడం నాకు ఇష్టంలేక నేనెప్పుడూ అడగలేదు. అమితమయిన జాలి వేసేది. ఎవరితోనూ అనేవాడిని కాదు.

ఏలియా చదువులో తెలివి గలవాడు. ప్రతి సబ్జక్టులో నూటికి తొంబయి మార్కులు తగ్గేవి కావు. లెక్కల్లో అయితే నూటికి నూరుపాళ్లు తప్పనిసరి. మా మాస్టర్లకు మరీ ముఖ్యంగా మా హెడ్మాస్టరు గారికి ఏలియా అంటే చాలా ఇష్టం. గౌరవంగా చూసేవాళ్లు. మొదట్లో నాకు లెక్కలు వచ్చేవి కావు. నూటికి నలభయి మార్కులు వచ్చాయంటే మా ఇంట్లో అందరూ ఆశ్చర్యపోయేవారు. లెక్కలంటే నాకున్న భయం పోగొట్టి చేయి పట్టి ముందుకు తీసుకువెళ్లింది ఏలియానే. వాడు నాతో తప్ప ఎవరితో ఎక్కువగా మాట్లాడేవాడు కాదు. నాకది గర్వంగా ఉండేది.

లెక్కల క్లాసు అయిపోతుండగా ఏలియా గాభరాగా నా దగ్గరకు వచ్చి, "నీతో ఒక సంగతి చెప్పాలి. బయటకు వస్తావా?" అడిగాడు. మాటల్లో బాధ కదిలింది. లేచి, "పద" అని వాడి కూడా క్లాసు గది బయటకు నడుస్తూ, "ఏమయింది?" అడిగాను.

వరండా చివరి వరకు వచ్చి పిట్టగోడకానుకుని నుంచున్న తర్వాత చిన్నగా అన్నాడు, "నా పెన్ను పోయింది". ఆ మాట అంటున్నప్పుడు వాడి ముఖంలో బాధ గడ్డ కట్టుకోసాగింది. సామాన్యంగా వాడు ఏ ఉద్వేగానికి లోనుకాడు.

"మూడు రోజుల కిందట మీ నాన్నగారు కొనిచ్చిందేనా?" అడిగాను.

తలూపాడు.

హెడ్మాస్టరుగారు సంతకం పెట్టి, స్టాంపు వేసి, "ప్రతి క్లాసుకు వెళ్లండి. ఏ క్లాసూ వదలొద్దు. ఒకవేళ క్లాసులో మాస్టారు లేకపోతే క్లాసు మానిటర్‌కిచ్చి నేను చదవమన్నానని చెప్పండి. బంట్రోతు లేడు. పోస్టాఫీసుకు పంపించాను. ఉండుంటే వాడినే పంపించేవాడిని. అన్ని క్లాసుల్లో చదివించండి. తప్పకుండా దొరుకుతుంది. దొరికాక వచ్చి నాకు చెప్పడం మర్చిపోవద్దు" అన్నారు.

"ఎక్కడ పోయింది?"

"చెట్టుకింద మనం భోజనాలు చేస్తున్నప్పుడు పోయి ఉండాలి".

"జేబుల్లో ఉందేమో చూసుకున్నావా?"

"చూశాను. లేదు..." అని మళ్లీ నా ముందే నిక్కరు, చొక్కా జేబుల్లో చేతులు పెట్టి వెదికి చూసుకుని, "లేదురా" అన్నాడు.

"పద. మనం భోజనం చేసిన చోటుకు వెళ్లి వెదుకుదాం".

"అక్కడంతా వెదికాను. అందుకే తిరిగి క్లాసుకు రావడం ఆలస్యం అయింది" అని తల అడ్డంగా ఆడించి, "దొరకలేదు" అన్నాడు.

"ఒక పని చేద్దాం" అన్నాను.

ఏమిటన్నట్టు చూశాడు.

"హెడ్మాస్టరుగారి దగ్గరకు వెళ్లి చెబుదాం".

"ఆయనేం చేయగలడు?"

"నీ కొత్త పెన్ను పోయిందని సర్క్యులర్ తీసుకుందాం"

"ఇస్తారా?"

"నువ్వు నాతో రా. నేనిప్పిస్తాను. నా ముఖం చూసి కాదు; నీ ముఖం చూసిస్తాడు. రా" అని ముందుకు రెండుగులు వేసి ఆగాను. ఏలియా కదలలేదు. వెనక్కి వచ్చి వాడి చేయి పట్టుకుని, వాడి చేతిలోని టిఫినుబాక్సు నా చేతిలోకి తీసుకుని, "నువ్వు నా కూడా వచ్చి నా పక్కనే ఉండు. మిగతా పనులు నేను చూసుకుంటాను" అన్నాను. చదువులో వెనకయినా మిగిలిన విషయాల్లో, తగాదాల్లో ముందుంటాను.

హెడ్మాస్టరుగారి గదిలోకి నడిచాను. "నేను లోపలికి రావొచ్చా సార్?" అని అడిగి అనుమతి తీసుకుని వెళ్లకపోతే చిరాకుపడి అరుస్తాడు. అడగకుండా గదిలోకి వచ్చినందుకు నా వంక కోపంగా చూస్తూ ఏదో అనబోయాడు కాని, నా పక్కన ఉన్న ఏలియాను చూశాక ఏమీ అనలేదు. ఒక్క గుక్కలో జరిగింది చెప్పేసరికి ఆయనకూ జాలి వేసింది. "అయ్యయ్యో" అని సొరుగులోంచి తెల్లకాయితం తీసి, దాని మీద నాలుగు మాటలు చక చక రాసి, "ఇలా రాసాను. వినండి. స్కూలు ఫయినల్, 'ఎ' సెక్షన్ విద్యార్థి బి.కె.ఏలియా తన కొత్త గోధుమరంగు రేనార్ పెన్ను భోజన విరామ సమయంలో పోగొట్టుకున్నాడు. దొరికినవాళ్లు దాన్ని అతనికి వెంటనే తిరిగిచ్చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను... చాలు కదా? ఇంకేమయినా రాయాలా?" ఏలియాను చూస్తూ అడిగారు.


"చాలండీ" అన్నాడు ఏలియా.

హెడ్మాస్టరుగారు సంతకం పెట్టి, స్టాంపు వేసి, "ప్రతి క్లాసుకు వెళ్లండి. ఏ క్లాసూ వదలొద్దు. ఒకవేళ క్లాసులో మాస్టారు లేకపోతే క్లాసు మానిటర్‌కిచ్చి నేను చదవమన్నానని చెప్పండి. బంట్రోతు లేడు. పోస్టాఫీసుకు పంపించాను. ఉండుంటే వాడినే పంపించేవాడిని. అన్ని క్లాసుల్లో చదివించండి. తప్పకుండా దొరుకుతుంది. దొరికాక వచ్చి నాకు చెప్పడం మర్చిపోవద్దు" అన్నారు.

తలూపి బయటకు వచ్చి క్లాసు క్లాసుకు చదివించాం. లాభం లేకపోయింది. నిరాశ పడ్డాం. కొత్తపెన్ను దొరికితే ఎవరు తిరిగిస్తారు? ఆ సంగతి హెడ్‌మాస్టరుగారికి చెబుదామని ఆయన గదికి వెళ్లాం. లేడు. బయటకు వెళ్లాడని బంట్రోతు చెప్పాడు. నీరస పడిపోయాం.

బడి వదిలిపెట్టాక ఆశ చావక మేం ఏ ప్రదేశంలో కూర్చుని భోజనం చేశామో అక్కడ, ఆ చుట్టుపక్కల, మంచినీళ్ల టేంకు దగ్గర ముప్పావుగంట పాటు వెదికాం. లాభం లేకపోయింది. ఏలియాకు విసుగు పుట్టిందేమో, "చాల్లే... ఎవరి చేతిలోకో వెళ్లిపోయింది... వెళ్దాం పద..." అన్నాడు.

పుస్తకాల సంచులు భుజాలకు తగిలించుకుని ఇంటిముఖం పట్టాం. పెన్ను పోయినందుకు అంతకుముందున్న ఉదాసీనత తగ్గింది కాని సంతోషంగా మటుకు లేదు. నడుస్తున్నాం. మేం ఇద్దరు ఉన్నప్పుడు వాడే ఎక్కువ మాట్లాడుతుంటాడు. నేను వింటాను. వాడికి చాలా విషయాలు తెలుసు. వాళ్ల నాన్న ఊళ్లో లేనప్పుడు స్టేట్ లైబ్రరీకి వెళ్లి



ఏలియా బండి కిందకు వెళ్లిపోయాడు. నా గుండె ఝుల్లుమంది. వాడింత ఘోరానికి ఒడికడతాడని నేను ఊహించలేదు. ఏమాత్రం అనుమానం వచ్చి ఉండినా వాడి పక్కనే ఉండి చేయి పట్టుకుని వదిలి ఉండేవాడిని కాదు. ఏడుస్తూ అరవడం మొదలెట్టాను. బండిలో ఉన్నవాళ్లూ, ఇవతలి ప్లాటుఫాం మీదున్నవాళ్లు అరుస్తున్నారు. కొన్ని అడుగులు చక్రం ఏలియాను లాక్కుంటూ వెళ్తోంటే ఎవరూ ఏం చేయలేకపోతున్నారు.



పుస్తకాలు చదువుతూ కూర్చుంటాడు. నన్నూ రమ్మనమనేవాడు కాని వాడంత గంటలసేపు కూర్చునే ఓపిక లేదు. రెండుసార్లు మటుకు వెళ్లాను. నడుస్తూ వాళ్ల అమ్మ గురించి ఆలోచిస్తున్నాడనుకుంటాను, "మా అమ్మ చాలా మంచిదిరా" అన్నాడు. వాళ్లమ్మ బతికి ఉండగా చాలాసార్లు వాళ్లింటికి వెళ్లాను. వెళ్లినప్పుడల్లా తినడానికి నాకేదయినా ఇచ్చేది. ఎప్పుడోకాని ఆమె ఇల్లు వదిలి బయటకు వచ్చేది కాదు. ఏలియాలాగే చాలా తక్కువమందితోనే మాట్లాడేది.

"నీ పెన్ను పోయిన సంగతి మీ నాన్నకు తెలియకుండా ఉంచలేవా?" అడిగాను.

తక్కువ ఖరీదు పెన్ను అయితే మా అమ్మ దగ్గరో నాన్న దగ్గరో ఏదో మిష మీద డబ్బులు తీసుకుని దాంతో ఏలియాకు పెన్ను కొనిచ్చేవాడిని. అంత డబ్బు నాకు వాళ్లివ్వరు.

తల అడ్డంగా ఆడించి, "పోగొట్టుకున్నందుకు నన్ను చంపేస్తాడురా..." నవ్వుతూ అన్నాడు. ఆ నవ్వులో ఎటువంటి బాధ నాకు కనిపించలేదు.

స్టేషను చేరుకున్నాం. స్టేషను దాటితే మా పేట వెళ్లే దారి వస్తుంది. స్టేషను మీంచి మాకు అడ్డదారి. లేకుంటే చుట్టూ తిరిగి వెళ్లాలి. దూరం అవుతుంది. మేం చేరుకున్న సమయానికి తెనాలి వెళ్లే బండి మొదటి లయిన్లో బయల్దేరడానికి సిద్ధంగా ఉంది. సిగ్నెలిచ్చి ఉంది. సామాన్యంగా అయితే బండి వెళ్లిపోయాకగాని మేం పట్టాలు దాటి అవతలి ప్లాటుఫాం మీదకు వెళ్లం.

ఇంటికి వెళ్లడానికి ఏలియా తొందరపడుతున్నాడనుకుంటాను, "ఈ బండి బయల్దేరుతుందో, ఏమో చివరి కంపార్టుమెంటు వెనక నుండి వెళ్దాం" అన్నాడు.

అటూ ఇటూ చూశాను. రెండో లయిన్లో బండ్లేమీ రావడం లేదు. "సరే" అని పట్టాల మీద కొచ్చాను. నా వెనకే వాడూ దిగాడు. రెండు లయిన్ల మధ్య ఉన్న దారి మీదకు వచ్చి నడవడం మొదలుపెట్టాం. వాడు నా వెనక నడుస్తున్నాడు. నేను దేని గురించో అడుగుతున్నాను. వాడు జవాబు చెబుతున్నాడు. మరో రెండు కంపార్టుమెంటులు దాటితే బండి చివరికొచ్చేస్తాం.

ఇంజను కూత వేసి మెల్లగా కదిలింది. ఆగాను. అప్పటివరకు నాతో మాట్లాడుతున్న ఏలియా ఏమీ మాట్లాడకపోవడంతో వెనక్కి తిరిగిచూశాను. పుస్తకాల సంచి దారిలో పడి ఉంది. ఏలియా బండి కిందకు వెళ్లిపోయాడు. నా గుండె ఝుల్లుమంది. వాడింత ఘోరానికి ఒడికడతాడని నేను ఊహించలేదు. ఏమాత్రం అనుమానం వచ్చి ఉండినా వాడి పక్కనే ఉండి చేయి పట్టుకుని వదిలి ఉండేవాడిని కాదు. ఏడుస్తూ అరవడం మొదలెట్టాను. బండిలో ఉన్నవాళ్లూ, ఇవతలి ప్లాటుఫాం మీదున్నవాళ్లు అరుస్తున్నారు. కొన్ని అడుగులు చక్రం ఏలియాను లాక్కుంటూ వెళ్తోంటే ఎవరూ ఏం చేయలేకపోతున్నారు. ఏలియా కొట్టుకులాడుతున్నాడు. చివరి కంపార్టుమెంటు దాటుతుండగా ఏలియా శరీరం రెండుగా విడిపోయింది. పేగులు బయటకొచ్చేశాయి. పట్టాల నిండా రక్తం. చూడలేక వాంతి చేసుకున్నాను. తట్టుకోలేకపోతున్నాను. ఏడుస్తూ ఏలియా తల దగ్గరకు వెళ్లబోతోంటే ఎవరో నన్ను గట్టిగా పట్టుకుని పక్కకు తీసుకెళ్లారు. ప్లాటుఫాం చివర బండి ఆగింది. చుట్టూ జనం చేరుతున్నారు. నన్నేవేవో ప్రశ్నలు వేస్తున్నారు. దేనికీ సమాధానం చెప్పలేకపోతున్నాను. ఎవరో గ్లాసెడు మంచినీళ్లు ఇచ్చారు. షాకు నుండి తేరుకోలేకపోతున్నాను.

పోలీసులు వచ్చాక శవాన్ని రెండో నెంబరు ప్లాటుఫాం మీద ఒక పక్కగా చేర్చి దుప్పటి కప్పి పంచనామా మొదలుపెట్టారు. ఏలియా చనిపోయిన వార్త అందరికీ తెలిసిపోయినట్టుంది. ఏలియా తండ్రి, మా నాన్న వచ్చారు. మా స్కూలు హెడ్‌మాస్టరు అయిదారుగురు టీచర్లు వచ్చారు. ఏలియాతో చివరివరకు నేనున్నాను కాబట్టి నన్నెటూ వెళ్లనీయలేదు. నెమ్మదిగా ఉంది కాని ఆ దృశ్యం నా మనసులో కదులుతోంటే ఎంత ఆపుకుంటున్నా దుఃఖం ఆగడం లేదు.

ఏం జరిగిందో, ఎలా జరిగిందో పూస గుచ్చినట్టు చెబితే ఒక పోలీసు రాసుకున్నాడు, ఇంకో పోలీసు శవం నిక్కరు జేబుల్లో ఉన్న ఒక్కో వస్తువును బయటకు తీస్తోంటే మరోతను వస్తువుల పేర్లు వరసగా రాసుకుంటున్నాడు. జేబుల్లోంచి బ్లేడు, రెండు రబ్బర్లు, షార్పనరు, నాలుగు రంగు పెన్సిళ్లు, రెండు మామూలు పెన్సిళ్లు, రుమాలు, చాక్లెట్‌లు ఏవేవో చిన్న చిన్న వస్తువులు ఉన్నాయి. ఎవరూ మాట్లాడడం లేదు. గాలి బిగుసుకుపోయినట్టుంది.

"అంతేనా?" రాసుకుంటున్న అతను అడిగాడు. - "అంతే"

"వెనక జేబులో ఏమున్నాయో చూడు" దుప్పటి కొద్దిగా పయికెత్తి చేయి మరింత లోపలికి పోనిచ్చి అర నిమిషం తర్వాత చేయి బయటకు తీశాడు. అతని చేతిలో రేనార్ పెన్ను ఉంది. ●

## రచయితలకు సూచనలు!

* మీ రచనలను కాగితాలకు ఒకవైపున మాత్రమే రాయాలి.
* జిరాక్స్ కాపీలను పరిశీలనకు స్వీకరించలేం.
* మీ రచనతోపాటు పూర్తి అడ్రసు రాయాలి. పిన్‌కోడ్ నెంబరు తప్పనిసరిగా ఉండాలి.
* అనువాద రచనలకి మూల రచయిత అనుమతి పత్రం జతచేయాలి.
* మీ రచన ఇదివరకు ఎప్పుడూ, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదన్న హామీపత్రం జతపరచాలి.
* ప్రచురించని రచనల్ని తిరిగి పొందాలనుకునేవారు తగినంత పోస్టేజీ స్టాంపులు అంటించిన సెల్ఫ్ అడ్రసు కవరు విధిగా జతపరచాలి.
* రచనల ప్రచురణకు సంబంధించి ఫోన్‌లో ఎలాంటి సంప్రదింపులకు తావులేదు.
* ఆరోగ్యకరమయిన హాస్య, వ్యంగ్య రచనలకి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది.

మీ రచనలు పంపించవలసిన చిరునామా:

**ఆదివారం వార్త,**
ఎడిటర్
'వార్త' తెలుగు దినపత్రిక,
లోయర్ ట్యాంక్‌బండ్,
హైదరాబాద్- **500 080**